### బార్బరా క్రెజికోవా

వింబుల్డన్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌ను చెక్ రిపబ్లిక్ క్రీడాకారిణి బార్బరా క్రెజికోవా గెలుచుకుంది. లండన్‌లో జూలై 13న నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో క్రెజికోవా ఇటలీ క్రీడాకారిణి జాస్మిన్ పౌలినిపై విజయం సాధించింది. 2021లో ఫ్రెంచ్ ఓపెన్‌ను గెలుచుకున్న క్రెజికోవా కెరీర్‌లో ఇది రెండోది కావడం విశేషం. విజేతకు రూ.28.64 కోట్లు, రన్నరప్‌నకు రూ.14.85 కోట్లు ప్రైజ్‌మనీ దక్కింది.

**రాజా రిత్విక్:** లాప్లాగ్నే ఇంటర్నేషనల్ చెస్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ గ్రాండ్ మాస్టర్ రాజా రిత్విక్ రన్నరప్‌గా నిలిచాడు. ఫ్రాన్స్‌లోని లాప్లాగ్నేలో జరిగిన టోర్నీలో తొమ్మిది రౌండ్లలో ఏడు పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి రజతం గెలుచుకున్నాడు.

# వాయుకాలుష్యం - ప్రజారోగ్యానికి ప్రమాదకరం

### పర్యావరణ పరిరక్షణ సూచీ-2024

- జీవరాశి మనుగడకు సురక్షితమైన పర్యావరణం అత్యంత అవసరం. వాతావరణ మార్పుల నియంత్రణకు 180 దేశాలు చేస్తున్న కృషిని మదింపు చేస్తూ ఇటీవల 'పర్యావరణ పనితీరు సూచీ-2024'ను వెలువడింది. ఎప్పటికప్పుడు పర్యావరణ స్థితిగతులను తెలుసుకుని ఆవరణ వ్యవస్థను మరింతగా మెరుగుపరచడానికి ఈ సూచీ తోడ్పడుతుంది.
- సురక్షితమైన వాతావరణంతోనే ఏ సమాజమైనా అభివృద్ధి సాధించగలుగుతుంది. అయితే మానవ చర్యల వల్ల ప్రకృతి వ్యవస్థలు దెబ్బతిని విపత్తులు సంభవిస్తున్నాయి. ఇలాంటి తరుణంలో పర్యావరణ సుస్థిరతకు కట్టుబాటు చాటేలా ప్రపంచ దేశాలను పారిస్ ఒప్పందం ఏకతాటిపైకి తీసుకొచ్చింది. ఈ క్రమంలో ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు పర్యావరణ పనితీరు సూచీ ఎంతగానో దోహదపడుతుంది. తాజా సూచీలో ఐరోపా, స్కాండినేవియన్ దేశాలు మొదటి 20 స్థానాలను ఆక్రమించాయి. పర్యావరణ అనుకూల విధానాలను అవి కఠిన నిబంధనలతో విస్తృత స్థాయిలో అమలు చేస్తున్నాయి. ఈ జాబితాలో ఎస్తోనియా, లక్సెంబర్గ్, జర్మనీ, ఫిన్లాండ్, యూకే మొదటి ఐదు స్థానాలను సాధిస్తే భారత్, మయన్మార్, లావోస్, పాకిస్థాన్, వియత్నాం అట్టడుగున నిలిచాయి.
- జింబాబ్వే వంటి ఒక ఉప సహారా దేశాలు నార్వే, అమెరికా, ఇటలీ వంటి దేశాల కంటే మెరుగ్గా వాతావరణ మార్పుల నుంచి ఉపశమనం కల్పించే చర్యలు చేపడుతుండటం విశేషం. బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తి నుంచి జీవ ఇంధనానికి మళ్లడం ద్వారా 2000-21 మధ్య కాలంలో ఈ దేశం కార్బన్ డై ఆక్సైడ్ స్థాయిలను సగానికి తగ్గించగలిగింది. ఎస్తోనియా ఈ సూచీలో మొదటి స్థానానికి చేరడం వెనుక గట్టి కృషి ఉంది. గడిచిన దశాబ్దకాలంలో అక్కడ గ్రీన్‌హౌస్ ఉద్గారాలను 40 శాతం తగ్గించారు. శిలాజ ఇంధనాల ద్వారా విద్యుదుత్పత్తి చేపట్టడాన్ని కుదించి పవన, సౌర విద్యుత్‌వైపు మళ్లారు. అడవుల జీవ వైవిధ్య పరిరక్షణకు అనేక చర్యలు చేపడుతున్నారు. అదేపనితీరును కొనసాగిస్తే 2050 నాటికి ఎస్తోనియా జీరో ఉద్గారాల స్థాయిని చేరుకోగలుగుతుంది. ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన అమెరికా తాజా పర్యావరణ పనితీరు సూచీలో ఎన్నో దేశాల కంటే వెనుకబడి 34వ స్థానంతో సరిపెట్టుకుంది.
- చైనా తన విద్యుదుత్పత్తిలో 60 శాతం బొగ్గును మండించడం ద్వారానే తయారు చేసిందని 2021 నాటి అంతర్జాతీయ ఇంధన సంస్థ నివేదిక వెల్లడించింది. ఆ మరునాటి ఏడాది ప్రపంచ వ్యాప్తంగా వెలువడిన గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాల్లో 28 శాతానికి చైనాయే కారణమైంది. చైనా కార్ల సంఖ్య 2004-18 మధ్య సుమారు పది రెట్లు పెరిగింది. అయితే సౌర విద్యుదుత్పత్తి, ఎలక్ట్రిక్ వాహనాల తయారీలో ఆ దేశం ప్రపంచంలోనే అగ్రగామిగా అవతరించడాన్ని గమనించాలి.




- ప్రపంచంలో అత్యధికంగా అమెరికా, చైనా, భారత్‌లో గ్రీన్‌హౌస్ ఉద్గారాలు విడుదలవుతున్నాయి. ఈ విషయంలో అమెరికా పతాక స్థాయిలో చేరుకుంది. అక్కడి తలసరి ఉద్గారాలు డ్రాగన్ కంటే 80 శాతం ఎక్కువగా భారత్ కంటే ఆరు రెట్లు అధికంగా ఉంటున్నాయి. భారత్‌లో ఉద్గారాలు గడిచిన దశాబ్దకాలంలో 32 శాతం ఎగబాకాయి. పారిశ్రామిక ఆర్థిక కార్యకలాపాలతో పాటు ఇంధన వినియోగమూ పెరుగుతుండటమే అందుకు కారణం. ఉద్గారాల కట్టడి కోసం కేంద్ర ప్రభుత్వం మొత్తం విద్యుదుత్పత్తిలో సగాన్ని సంప్రదాయేతర ఇంధన వనరుల ద్వారానే చేపట్టాలని లక్షించింది. అటువంటి చర్యల ద్వారా కర్బన ఉద్గారాలను తగ్గించుకుంటూ 2070 నాటికి జీరో స్థాయికి చేరాలని సంకల్పించింది. అధిక జనాభా ఆర్థిక సవాళ్ల నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తూ అభివృద్ధి పథంలో వడివడిగా ముందుకు సాగడం రానున్న కాలంలో భారత్‌కు సాధ్యమే.

**పర్యావరణ పనితీరుకు సమర్థ చర్యలు**

- పర్యావరణ తాజా సూచీలో ఏ దేశం 80 పాయింట్లకు మించి సాధించలేకపోవడం విచారకరం. అంటే పర్యావరణ సుస్థిరత సాధనలో ప్రపంచం చాలా వెనుకబడిందని అర్థం. వాయుకాలుష్యం ప్రజారోగ్యానికి పెను ప్రమాదకరంగా పరిణమిస్తుంది. సూక్ష్మస్థాయి కాలుష్య కారకాల వల్ల 2021లో 78 లక్షల మంది మరణించారు. ఇవి మొత్తం ప్రపంచ మరణాల్లో 12 శాతం ప్రజారోగ్యానికి సీసం కారణంగా వాటిల్లుతున్న దుష్పరిణామాల కట్టడికి దేశాలేవీ సరైన చర్యలు తీసుకోవడం లేదన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.
- ఒక అధ్యయనం ప్రకారం సీసం ప్రభావం కారణంగా సంభవిస్తున్న మరణాల సంఖ్య 1990-2019 మధ్య 70 శాతం పెరగడం తీవ్ర ఆందోళనకరం. సీసం ప్రభావాల కారణంగా 2021లో 15 లక్షల మరణాలు సంభవించాయని 'గ్లోబల్ బర్డెన్ ఆఫ్ డిసీజ్' నివేదిక గతంలో హెచ్చరించింది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రపంచ ఆర్థిక రాజకీయ శక్తులుగా ఉన్న అమెరికా, చైనా, భారత్‌కు పర్యావరణ పరిరక్షణకు గట్టి చర్యలు తలపెట్టి మిగతా దేశాలకు ఆదర్శంగా నిలవాలి.

**విపత్తుల సమాచార వ్యవస్థ**

- వరదలు పోటెత్తుతున్నప్పుడు విపత్తులు ముంచుకొస్తున్నప్పుడు క్షేత్ర స్థాయిలో అందరినీ అప్రమత్తం చేసే వ్యవస్థ లేని లోటు కనిపించింది. విపత్తుల నిర్వహణను పర్యవేక్షించే రెవెన్యూ శాఖ పరిధిలో గ్రామ స్థాయిలో తగిన యంత్రాంగం లేకపోవడం పెను నష్టానికి కారణమైందని అన్ని వర్గాల నుంచి కనిపిస్తుంది.
- భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట మండలంలో పెదవాటు ప్రాజెక్టు కట్ట కొట్టుకుపోయిన సంఘటన నుంచి మున్నేరు, పాలేరు, ఆకేరు వాగుల వరదలు, చెరువులు ఉప్పొంగిన ఘటనల వెనుక తీవ్ర సమాచార లోపం కనిపిస్తుంది. దీంతో వరదల తాకిడి సందర్భంగా ప్రభుత్వ ఉన్నతాధికారులు సమాచారం కోసం రెవెన్యూ మినహా ఇతర శాఖలు స్థానికులపై ఆధారపడాల్సి వస్తుంది.

**ముందస్తు సమాచారం లేకపోవడం**

- భారీ వర్షాలతో మహబూబాబాద్‌లో చెరువుల వరద దిగువకు వెళ్లడం ప్రారంభమైంది. దీంతో ఆకేరు వాగు ఉధృతి పెరిగింది. ఆగస్టు 30, 31 తేదీల్లో అతి భారీ వర్షాలు కురిశాయి. చెరువుల్లోకి వరద రావడం ప్రారంభమైంది. దీని గురించి ముందుగానే చెరువులకు గండ్లు పెట్టడం లేదా తూములను ఎత్తి నీటిని వదలడం వంటి చర్యలు చేపట్టలేకపోయారు.
- పాలేరు, మున్నేరు పరీవాహకంలో ఆగస్టు 31న వరద ప్రారంభమైంది. దీన్ని కూడా గుర్తించి సమీప గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయడంలో లోపం చోటు చేసుకుంది. అర్ధరాత్రి దాటాక 5 గంటల సమయంలో ఖమ్మం నగరంలో యుద్ధ ప్రాతిపదికన ఇళ్లు ఖాళీ చేయాలంటూ అధికారులు హెచ్చరించారు.
- చెరువుల్లో నీటి మట్టం శిఖం కబ్జాలు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు, మరణాలు, విపత్తుల సమాచారం, గ్రామాల్లో అంతర్గతంగా సాగుతున్న వ్యవహారాల వివరాలు, పిడుగుపాటు సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరించి తహసీల్దార్లకు అందజేసేవారు వీఆర్ఏ, వీఆర్వోలు. అక్కడి నుంచి ఆర్డీవోలు, కలెక్టర్లు, సీఎస్‌కు వేగంగా సమాచారం అందేది. దీంతో పాటు ప్రభుత్వం నుంచి వచ్చే సమాచారం గ్రామాలకు వేగంగా చేర్చి, దండోరా ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా ఈ రెండు వ్యవస్థలు (వీఆర్ఏ, వీఆర్వో) కీలక పాత్ర పోషిస్తాయి. గత ప్రభుత్వం 2020లో వీఆర్ఏ, వీఆర్వో వ్యవస్థలను రద్దు చేయడంతో గ్రామస్థాయిలో లోటు ఏర్పడింది. కనీసం వారి స్థానంలో గ్రామస్థాయిలో ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయకపోవడంతో విపత్తుల సమయంలో ఆ లోపం కనిపిస్తుంది.

### స్థానిక పరిస్థితులపై అవగాహన లోపం

- వరదల సమయంలో స్థానిక పరిస్థితులపై అవగాహన ఉన్న అధికారులు లేకపోవడం మరో లోటుగా కనిపించింది. గత సంవత్సరం ఈ ఏడాది శాసనసభ, లోక్‌సభ ఎన్నికలు జరిగాయి. నిబంధనల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా తహసీల్దార్లు, ఆర్డీవో, ఎంపీడీవో తదితర కేడర్ అధికారులను బదిలీ చేశారు. వారికి సుదూర ప్రాంతాల్లో పోస్టింగ్ ఇచ్చారు. సాధారణంగా ఎన్నికలు పూర్తి కాగానే తిరుగు బదిలీలు చేపడతారు. ఆంధ్రప్రదేశ్‌లో పూర్తి చేశారు. తెలంగాణలో మాత్రం ఇంతవరకు చేపట్టలేదు. దీంతో దక్షిణ, పశ్చిమ అధికారులు ఉత్తర, తూర్పు జిల్లాల్లో అక్కడి వారు ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. దీంతో ప్రమాదకరమైన వాగులు, ఉపనదులు, చెరువుల ప్రవాహాల ఉధృతిపై వారికి అంతగా అవగాహన పట్టు లేదు. తీరా విపత్తులు చోటు చేసుకున్నాక ఉన్నతాధికారుల ఒత్తిడితో హడావిడిగా చేసినా పెద్దగా ప్రభావం కూడా కనిపించలేదన్న అభిప్రాయం ఉంది. ప్రభుత్వ కీలకమైన ఈ అంశాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్న చర్చ నడుస్తుంది.
- విపత్తుల సమాచారాన్ని అందించే వ్యవస్థ సరిగ్గా లేకపోవడం వల్ల తెలంగాణ రాష్ట్రంలో అప్రమత్తత చర్యలకు ఆస్కారం లేక భారీ నష్టం జరిగింది. క్షేత్ర స్థాయిలో కనిపించిన వీఆర్ఏ, వీఆర్వో వ్యవస్థల రద్దు ప్రభావం గ్రామస్థాయిలో రెవెన్యూ యంత్రాంగం అవశ్యకతను చాటిన వరదలు.

**జీ గిరిధర్**
సివిల్స్ ఫ్యాకల్టీ
బీసీ స్టడీ సర్కిల్, హైదరాబాద్
9966330068



### మాదిరి ప్రశ్నలు

1. **నిరంతర అభివృద్ధి నేపథ్యంలో విపత్తు నిర్వహణ, వాతావరణ ప్రమాద నిర్వహణ కేంద్ర బిందువుగా ప్రపంచ విపత్తు నిర్వహణ సమావేశాలు నిరంతరంగా నిర్వహిస్తారు. వీటిని నిర్వహించేది ఏది?**
   1) ఐక్యరాజ్యసమితి
   2) ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ మెదక్
   3) ఇంటర్ గవర్నమెంట్ క్రైసిస్ మేనేజ్‌మెంట్ కమిటీ
   4) జపాన్ అంతర్జాతీయ సహకార సంస్థ
2. **కింది వాటిలో సరైన జతను గుర్తించండి?**
   ఎ. ఇంఫన్ తుఫాన్- పశ్చిమ బెంగాల్
   బి. వాయు తుఫాన్- గుజరాత్
   సి. ఫెతాయ్ తుఫాన్- ఆంధ్రప్రదేశ్
   1) సి 2) ఎ, బి 3) ఎ, బి, సి 4) ఎ, సి
3. **కింది కార్యకలాపాల్లో దేని కోసం భారత్ రిమోట్ సెన్సింగ్ (ఐఆర్ఎస్) ఉపగ్రహాలను ఉపయోగిస్తుంది?**
   ఎ. పంటల ఉత్పత్తిని అంచనా వేయడానికి
   బి. భూగర్భ జల వనరులను అన్వేషించడానికి
   సి. ఖనిజాల అన్వేషణ
   డి. టెలీ కమ్యూనికేషన్
   ఇ. ట్రాఫిక్ అధ్యయనానికి
   1) ఎ, బి, సి 2) డి, ఇ
   3) ఎ, బి 4) పైవన్నీ సరైనవే
4. **కొండ చరియలు (మట్టిపెళ్లలు) విరిగి పడటం అనేది ఏ రకమైన విపత్తు?**
   1) జల సంబంధమైన 2) వాతావరణం
   3) భూ భౌతిక 4) మెటీయోరాలాజికల్
5. **కాలుష్యకం అంటే అర్థం?**
   1) పర్యావరణానికి తాత్కాలికమైన నష్టం కలగడం
   2) కాలుష్యం కలుగజేసే పదార్థం
   3) పర్యావరణానికి శాశ్వతమైన నష్టం కలిగించడం
   4) పైవన్నీ
6. **ధ్వని కాలుష్య దుష్పరిణామాలను గుర్తించండి?**
   ఎ. చెవి వినికిడి శక్తి తగ్గిపోవడం
   బి. రక్తపోటు హెచ్చుగా ఉండటం
   సి. శ్వాస ఆగిపోవడం
   1) ఎ 2) ఎ, బి 3) ఎ, సి 4) ఎ, బి, సి
7. **భోపాల్ దుర్ఘటనలో వెలువడిన వాయువు?**
   1) కార్బన్ డై ఆక్సైడ్ 2) కార్బన్ మోనాక్సైడ్
   3) సిల్వర్ అయోడైడ్
   4) మిథైల్ ఐసోసయనేట్
8. **ఏ శిఖరాగ్ని కింది వాటికి చాలా ప్రమాదకరం?**
   1) మడ అడవి 2) గడ్డి నేలలు
   3) పొదల అడవి 4) కోనిఫెరస్ అడవి
9. **ఒక సునామీలో మొదటి అల?**
   1) అన్నిటి కంటే పెద్దది
   2) అన్నిటి కంటే పెద్దది కాకపోవచ్చు
   3) అన్నిటి కంటే ప్రమాదకరమైనది
   4) పైవన్నీ సరైనవి కావు
10. **విపత్తు ఉపశమన నిధిని మొట్టమొదటగా ఎవరి సిఫారసు ద్వారా నెలకొల్పారు?**
    1) 7వ ఆర్థిక సంఘం 2) 8వ ఆర్థిక సంఘం
    3) 9వ ఆర్థిక సంఘం 4) 10వ ఆర్థిక సంఘం
11. **పెట్రోల్ యంత్రాల నుంచి విడుదలయ్యే ప్రధాన కాలుష్యాలు?**
    ఎ. కార్బన్ హైడ్రో కార్బన్లు బి. సల్ఫర్ ఆక్సైడ్
    సి. కార్బన్ మోనాక్సైడ్ డి. సీసం
    1) ఎ, బి, డి 2) ఎ, బి, సి
    3) ఎ, సి, డి 4) పైవన్నీ సరైనవే
12. **కొండ చరియలు విరిగి పడటానికి కారణాలేమిటి?**
    ఎ. భూగర్భ జలాల ఒత్తిడి
    బి. వృక్ష సంబంధ ఎదుగుదల లేకపోవడం
    సి. అగ్నిపర్వత విస్ఫోటనాలు
    1) ఎ, బి 2) బి, సి
    3) ఎ, సి 4) ఎ, బి, సి
13. **దేశంలో గరిష్ఠ వరదల ప్రభావం కలిగిన రాష్ట్రం ఏది?**
    1) ఒడిశా 2) ఉత్తరప్రదేశ్
    3) హర్యానా 4) ఆంధ్రప్రదేశ్
14. **మోటార్ వాహనాల నుంచి వెలువడే ప్రధాన కాలుష్య కారకం ఏది?**
    1) సల్ఫేట్ 2) కార్బన్ మోనాక్సైడ్
    3) నైట్రేట్ 4) సల్ఫ్యూరిక్ ఆమ్లం
15. **సహజ వాయువులో ఎక్కువ మోతాదులో ఉండే సమ్మేళనాలు దేనిలో తయారవుతాయి?**
    1) సల్ఫర్ 2) కార్బన్ 3) ఆక్సిజన్ 4) హైడ్రోజన్
16. **ప్రపంచ ఉష్ణోగ్రతలు పెరగడం, వాతావరణ మార్పులకు కారణమయ్యే గ్రీన్‌హౌస్ వాయువులు?**
    ఎ. కార్బన్ డయాక్సైడ్ బి. మీథేన్
    సి. క్లోరో ఫ్లోరో కార్బన్‌లు డి. ఆర్గాన్
    1) బి, సి, డి 2) ఎ, బి 3) ఎ, సి 4) ఎ, బి, సి

### సమాధానాలు

1-1, 2-3, 3-1, 4-1, 5-2, 6-2, 7-4, 8-4, 9-2, 10-3, 11-3, 12-4, 13-2, 14-2, 15-2, 16-4.